సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



డేంజర్ హైవే!
కడప-రేణిగుంట హైవే(ప్రస్తుతం)డేంజర్‌గా మారింది. ఈ దారిలో నిత్యం ఏదో ప్రాంతంలో ప్రమాదం జరుగుతూనే ఉంది. ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. -8లో



ఆధిక్యంలో చిత్తూరు జట్టు
ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. చిత్తూరు జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 452 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	435	527
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 244.480 కిలోలు



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత ..సౌకర్యాలపై 'సాక్షి' క్యాంపెయిన్.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం చట్టాలు అమలుపరిచి కఠినంగా శిక్షించినప్పుడే వైద్యులకు రక్షణ ఉంటుంది.రాత్రి సమయాల్లో వైద్యులు విధుల్లో ఉండాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆసుపత్రి ఏరియాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచాలి. విచారణ పేరుతో కాలయాపన చేయకుండా నిందితులను తక్షణమే కఠినంగా శిక్షించాలి. - నిలోఫర్ బేగం, లక్కిరెడ్డిపల్లె ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

ప్రత్యేక చట్టం తేవాలి



దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ అస్పత్రులలో పని చేసే డాక్టర్లు, సిబ్బందికి రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. రాత్రివేళల్లో విధులు నిర్వహించే వారికి సౌకర్యాలు కల్పించాలి. ప్రతి ఆసుపత్రిలో పోలీసు కానిస్టేబుల్ ఉండే విధంగా చూడాలి. కోల్‌కతా ఘటనకు పాల్పడిన నిందితులకు కఠిన శిక్ష అమలు చేయాలి.
-వై కేజియా రాణి, ఏఎన్‌ఎం, ఉర్లగడ్డపదు, రైల్వేకోడూరు

నిందితులను శిక్షించాలి



కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన సంఘటనలో మానవమృగాలను కఠినంగా శిక్షించాలి. ప్రభుత్వాలు కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. వైద్యులు, సిబ్బందిపై కొంత మంది దురుసుగా ప్రవర్తిస్తున్నారు.ఇలాంటి వారిపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలి. అప్పుడే డాక్టర్లకు భరోసా కలుగుతుంది.
-గ్లోరి లిటిల్ ఫ్లవర్, హెడ్ నర్సు, సీహెచ్‌సీ, తంబళ్లపల్లె

భద్రత పెంచాలి



కోల్‌కతా వైద్య కళాశాలలో డాక్టర్‌పై జరిగిన అత్యాచార ఘటన యావత్ దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. అన్ని ఆస్పత్రుల్లో వైద్యులతోపాటు సిబ్బంది ప్రాణ రక్షణ, భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేక పోలీసు ప్రొటెక్షన్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి. -పార్వతమ్మ, నర్స్, సంబేపల్లె పిహెచ్‌సి, సంబేపల్లె మండలం

న్యూస్‌రీల్

ఆగస్టు 31నే పింఛన్ల పంపిణీ
రాయచోటి: సెప్టెంబర్ నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈనెల 31వ తేదీన పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 1న ఆదివారం కావడంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. 31వ తేదీ పింఛన్లు అందకపోతే సెప్టెంబర్ 2వ తేదీ అందరికీ అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైందని కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ 2 తర్వాత పింఛన్లు అందజేయబడవన్నారు. కావున పింఛనర్లు ఈనెల 31వ తేదీ గ్రామంలో అందుబాటులో ఉండాలన్నారు.

నేటి నుంచి దర్గా మాతాజీ ఆరాధన
రామాపురం: మండలపరిధిలోని నీకంఠరావుపేట సమీపంలో ఉన్న దర్బార్ అనంత ఆశ్రమంలో సమాధి పొందిన శ్రీ సద్గురు దర్గా స్వామీజి అర్ధాంగి శ్రీ సద్గురు మాతాజీ ఆరాధన మహోత్సం శుక్రవారం నుంచి జరగనున్నట్లు భక్తులు గురువారం తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో బెంగళూరుకు చెందిన వేద పండితులతో కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. శుక్రవారం ఉదయం శ్రీ సద్గురు దర్గాస్వామి, దర్గా మాతాజీ మందిరం వద్ద ప్రార్థనలు, రుద్రాభిషేకం జరగుతాయన్నారు . సాయంత్రం శ్రీ లలితా సహస్రనామపూజ, ఉయ్యాల ఉత్సవం, మంగళ హారతి ఉంటాయన్నారు. శనివారం సాయంత్రం స్వామి వారి పల్లకీ ఉత్సవం జరగుతుందని భక్తులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం
రాయచోటి (జగదాంబసెంటర్): ప్రముఖ కంపెనీ ఎస్‌కె సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అమెజాన్ వారి ఆధ్వర్యంలో వేర్‌హౌస్ అసోసియేట్‌గా పనిచేసేందుకు జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. వయస్సు 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి, ఇంగ్లీష్‌పై ఖచ్చితమైన అవగాహన ఉండాలని తెలిపారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైకు సమీపంలోని పొన్నేరి, గుమ్మడిపుండి ప్రాంతాల్లో గల కంపెనీలో పికింగ్, ప్యాకింగ్, స్కానింగ్, సార్టింగ్ లోడింగ్ అండ్ అన్‌లోడింగ్ విభాగాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు.అర్హులైన గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ధృవీకరణపత్రం, ఇతర పత్రాల నకలులను గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి నేరుగా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న జిల్లా గిరిజన సంక్షేమం, సాధికారిత అధికారి వారి కార్యాలయంలో సెప్టెంబర్ 9వ తేదీలోగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

సందిగ్ధం!

60 ఎకరాలు – నూతన కలెక్టరేట్ నిర్మాణానికి కేటాయించిన స్థలం

రూ.100 కోట్లు – కలెక్టరేట్ నిర్మాణానికి కేటాయించిన మొత్తం

రూ.10 కోట్లు – తొలి విడతగా కలెక్టరేట్ నిర్మాణానికి మంజూరైన మొత్తం

2022 ఏప్రిల్ 4 – రాయచోటి జిల్లా కేంద్రంగా ఏర్పడిన తేదీ



నాడు నూతన కలెక్టరేట్ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం

- నూతన కలెక్టరేట్‌కు 60 ఎకరాలకు పైగా కేటాయింపు
- వైఎస్ జగన్ సర్కార్ ఆధ్వర్యంలో రూ. 100 కోట్లు మంజూరు
- వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మాణ పనులకు టెండరు ప్రక్రియ పూర్తి
- కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో టెండర్లను రద్దు చేసిన వైనం
- కొత్త కలెక్టరేట్ నిర్మాణ పనులపై అలుముకున్న నీలి నీడలు

సాక్షి రాయచోటి: జిల్లాల పునర్విభజనలో భాగంగా పురుడు పోసుకున్న అన్నమయ్య జిల్లాకు బాలారిష్టాలు తప్పడం లేదు. జిల్లా కేంద్రంతోపాటు ఇతర నియోజకవర్గాల్లోనూ కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత అభివృద్ధి పరుగులు తీసింది. జిల్లా కేంద్రమైన రాయచోటిని అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు పనులు వేగంగా జరిగాయి. అయితే కాలంలో మార్పులు, పరిస్థితుల ప్రభావంతో ప్రస్తుతం జిల్లా కేంద్రమైన రాయచోటిలోని నూతన కలెక్టరేట్ నిర్మాణంపై కూడా సందిగ్ధం నెలకొంది. జిల్లా కేంద్రంలో పరిపాలన పరంగా కేంద్ర బిందువుగా ఉండే కలెక్టరేట్ నిర్మాణానికి సంబంధించి అనేక అనుమానాలు కొనసాగుతున్నాయి.

నూతన కలెక్టరేట్‌కు రూ. 100 కోట్లు

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో నూతన కలెక్టరేట్ నిర్మాణానికి 2024 ప్రథమార్థంలోనే వైఎస్ జగన్ సర్కార్ రూ. 100 కోట్లు కేటాయించింది. అంతేకాకుండా తొలి విడతగా పనులు చేపట్టేందుకు రూ. 10 కోట్లు కేటాయించినట్లు సమాచారం. అధునాతన వసతులు, కొత్త హంగులతో అద్భుతంగా భవనాలను తీర్చిదిద్దేందుకు అధికారులు సంకల్పించారు.

- కలెక్టరేట్ భవనంలో కలెక్టర్, జేసీ, డీఆర్వోల చాంబర్‌లతోపాటు అన్ని శాఖలకు సంబంధించిన కార్యాలయాల భవనాలు ఒకే చోట ఉండేలా రూపకల్పన చేశారు. అంతేకాకుండా జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌తోపాటు అడిషనల్ ఎస్పీ, ఇతర పోలీసు అధికారుల భవనాలు కూడా అక్కడే నిర్మాణాలు చేపట్టేలా ప్రతిపాదనలు రూపొందించారు. ఇందుకు సుమారు రూ. 100 కోట్లు అవసరమవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, వైఎస్సార్ సీపీ సర్కార్ ఈ ఏడాది మొదట్లోనే నిధులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

కలెక్టరేట్ టెండర్ల రద్దు?
రాయచోటిలోని నూతన కలెక్టరేట్‌కు సంబంధించి టెండర్లను రద్దు చేసినట్లు విశ్వసనీయంగా తెలియవచ్చింది. భవన నిర్మాణాల పనులను ప్రొద్దుటూరుకు చెందిన ఓ నిర్మాణ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో టెండర్లు జరిగాక అగ్రిమెంటు అనంతరం సదరు సంస్థ పనులు చేపట్టేందుకు సిద్ధమైంది. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్ని తారుమారు అయ్యాయి. ఈ నేపథ్యంలోనే టెండర్లను కూడా రద్దు చేసి రీ టెండరు ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిసింది. అంతేకాకుండా ప్రస్తుతం రాయచోటి రింగ్‌రోడ్డు సమీపంలో వేంపల్లెకు వెళ్లే రహదారికి ఆనుకునే ప్రాంతంలోనే నూతన కలెక్టరేట్‌కు సుమారు 60 ఎకరాలకు పైగా స్థలాన్ని ఎంపిక చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త ప్రభుత్వం ప్రస్తుతం ఎంపిక చేసిన స్థలంలోనే నూతన నిర్మాణాలు చేపడుతుందా? లేక మళ్లీ కలెక్టరేట్‌కు సంబంధించి కొత్తగా ఇతర ప్రాంతాల్లో స్థలాన్ని ఎంపిక చేస్తారా? అనే అనుమానాలు ప్రజల్లో రేకెత్తుతున్నాయి. ఏది ఏమైనా కొత్త కలెక్టరేట్ నిర్మాణ పనులపై నీలి నీడలు అలుముకున్నాయి.

ఇసుక సేన..మజాకా!
- కేసు నమోదు చేయవద్దని పోలీసులపై జనసేన ఒత్తిడి



నారాయణనెల్లూరుకు చెందిన జనసేన పార్టీ నాయకుడు సాయికి చెందిన ఇసుక ట్రాక్టర్

రాజంపేట: రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని నారాయణ నెల్లూరు(రైల్వేకోడూరు నియోజకవర్గం)లో జనసేన నాయకుల కనుసన్నల్లో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమ రవాణాకు అడ్డుకట్టకు వేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం జనసేన ఇసుకాసురులను మాత్రం పట్టించుకోవడం లేదు. జనసేనకు నాయకుడుగా చెప్పుకొనే ఓ వ్యక్తి నారాయణ నెల్లూరులో ఇసుక తరలిస్తుండగా.. రాజంపేట-నెల్లూరు రహదారి సరిహద్దు గ్రామం అనుంపల్లెలో చిట్వేలి పోలీసులు పట్టుకున్నారు. అక్రమ రవాణా కేసు లేకుండా చేసేందుకు చిట్వేలి పోలీసులపై జనసేన నాయకులు ఒత్తిడి చేశారు. ఇసుక తరలించడమేగాక. అడ్డుకున్న ఎస్‌ఐ, పోలీసులపైనే దౌర్జన్యం చేసే పరిస్థితి ఉండడంతో పోలీసు అధికారులు నిస్సహాయస్థితిలో ఉండిపోతున్నారు.

ఒంటిమిట్టలో బాలాలయం ఏర్పాట్ల పరిశీలన
ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండరామస్వామివారి ఆలయంలో సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు బాలాలయం జరుగనుంది. ఇందులో భాగంగా గురువారం కల్యాణ వేదికను బాలాలయానికి అనువుగా ఏర్పాటు చేస్తున్న సందర్భంగా టీటీడీ సివిల్ డిపార్టుమెంట్ డిప్యూటీ ఈఈ నాగరాజు పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్



స్పోర్ట్స్‌డే వేడుకలలో పాల్గొన్న హాకీ క్రీడాకారులు

రాయచోటి అర్బన్: హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ అని అన్నమయ్య జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరరావు అన్నారు.గురువారం స్థానిక రాజుహైస్కూల్ ఆవరణంలో స్పోర్ట్స్‌డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. హాకీ క్రీడలో ధ్యాన్‌చంద్ సుప్రసిద్ధ ఆటగాడు అన్నారు. స్థానిక క్రీడాకారులు క్రీడలలో గొప్పగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో రాజు హాకీ అకాడమీ కోచ్ చంద్ర, సభ్యులు సుబ్బు ,నారాయణ,రాజు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలి
జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: గృహ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్‌లు, ఆర్డీఓలు, డీఎల్‌డీఓలు, మండల స్పెషల్ అధికారులు, లే అవుట్ ఎస్‌ఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, హసింగ్ ఈఈలు, డీఈలు తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. స్టేజీ కన్వర్షన్ హౌసింగ్ యాప్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ అంశాలపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రగతిలో వెనుకబడిన వారిని కారణాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక పాలసీ మేరకు ఇసుక సరఫరా చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని గృహ నిర్మాణాలకు 46 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరమవుతుందని అంచనా వేశామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శన్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్‌లు మేఘస్వరూప్, వైఖోమ్ నదియా దేవి, ఆర్డీఓ రంగస్వామి, హౌసింగ్ పీడీ శివయ్య, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఫ్రీ హోల్డ్ భూముల రీ వెరిఫికేషన్ ప్రక్రియ

ఫ్రీ హోల్డ్ భూముల రీ వెరిఫికేషన్ ప్రక్రియ నిబంధనల మేరకు జరగాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్‌లతో ఫ్రీ హోల్డ్ భూముల రీ వెరిఫికేషన్ ప్రక్రియ, ఓటర్ల సవరణ-2025, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



కనసానివారిపల్లెలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

కురబలకోట: 'ప్రజలే మా బలం..బలగం.. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు కేడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటాం' అని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని కనసానివారిపల్లెలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో వారు మాట్లాడుతూ తామెప్పుడూ ప్రజల పక్షమేనన్నారు. ఏ సమయంలోనైనా నాయకులు, కార్యకర్తలకు తోడు నీడగా అందుబాటులోనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కనసానివారిపల్లె గ్రామ సర్పంచ్ ఆర్కే కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ ఎం. సుబ్బారెడ్డి, ముత్ర దాము, వన్ను కొండారెడ్డి, మూలింటి శంకర్ రెడ్డి, మొలక గోపాల్‌రెడ్డి, బండపల్లె కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలన భాషగా తెలుగు అమలు కావాలి

- కలమల్ల శాసనం తెలుగు వారికి గర్వకారణం
- భాష ప్రాచీనతకు శాసనాలే పునాదులు
- తెలుగుభాషా దినోత్సవంలో వెంకయ్యనాయుడు, వక్తలు



శాసనాలను తిలకిస్తున్న వెంకయ్యనాయుడు



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, ప్రజలు

కడప కల్చరల్: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పాలనా భాషగా తెలుగును తప్పక అమలు చేయాల్సి ఉందని భారత పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా గురువారం జిల్లాలోని ఎర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన తెలుగు భాషా దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలుగుభాష అమలుపై ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని, పాలనాభాషగా తెలుగును తప్పక అమలు చేస్తేనే ఫలితం ఉంటుందన్నారు. కలమల్లలో తొలి తెలుగు శాసనం లభించడంతోనే ప్రస్తుతం ఇక్కడ తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా ఇక్కడికి వచ్చి ఆ శాసనాన్ని దర్శించుకున్నందుకు తెలుగు వాడిగా గర్విస్తున్నామన్నారు. భాష ప్రాచీనతకు శాసనాలే పునాదుల్లాంటివని అన్నారు. దిగువస్థాయి కోర్టుల వరకు తెలుగును అమలు చేయాలన్నారు. పెన్నానది ఒడ్డున ఉన్న ప్రభావంతో ప్రొద్దుటూరు సాహిత్య కేంద్రంగా ఎందరో గొప్ప కవులకు నిలయంగా మారిందన్నారు. ఇక్కడ రామాయణ భారత భాగవతాలకు చక్కని వ్యాఖ్యానం రాశారన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ మన పిల్లలను తెలుగులోనే చదివించాలన్నారు. కలమల్ల థర్మల్ స్టేషన్ పక్కనే త్వరలో రూ. 10 వేల కోట్లతో ఉక్కు ఫ్యాక్టరీ రానుందని, 750 మెగా వాట్ల సోలార్ ఇండస్ట్రీ రానుందన్నారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవాలు ఎందుకు చేస్తున్నామో నేటితరం వివరంగా తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు పదం ఆవిర్భావం, పరిణామక్రమం గురించి వివరించారు. ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కూడా మాట్లాడారు.వేదికపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి, బీజేపీ యువ నాయకులు భూపేష్‌రెడ్డి కూడా ఆశీనులయ్యారు.

కవులకు సత్కారం

ఈ వేదికపై స్థానిక ప్రముఖ కవులకు తెలుగు భాషా దినోత్సవ పురస్కారాలను అందజేశారు. సీనియర్ కవి అవధాని నరాలరామారెడ్డి, డాక్టర్ పి.సంజీవమ్మ, తవ్వా ఓబుల్‌రెడ్డిలకు ఈ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వెంకయ్యనాయుడు ఇంటాక్ కడపశాఖ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ప్రచురించిన మన చరిత వారసత్వ బులిటెన్‌ను ఆవిష్కరించారు. తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. తొలుత వేదికపై తెలుగు ప్రముఖుల చిత్రపటాలకు పుష్పాభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన తెలుగుభాష ప్రాచీనతను తెలిపే ఛాయాచిత్రాల ప్రదర్శనను కలెక్టర్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఇతర అతిథులతోకలిసి సందర్శించారు. జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఈఓ అనూరాధ, వివిధ శాఖల అధికారులు, భాషోపాధ్యాయులు, ఆర్టీపీపీ అధికారులు, సమీప పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్ష పడేలా చట్టాలు అవసరం



ప్రభుత్వ ఆస్పత్రులలోనే భద్రత కరవైంది. ఇంత జరిగినా చట్టంలో సెక్షన్లు చూపుతూ కాలయాపన చేయడంతో ఎవరూ భయపడడం లేదు. ఎన్నో చట్టాలు తెచ్చినా ఉపయోగం లేదు. తప్పుచేసిన వారిలో భయం కనపడడం లేదు ఈ సంఘటన జరిగిన వెంటనే నేరుగా శిక్ష పడేలా చట్టాలు ఉండాలి. ప్రభుత్వం తీసుకునే చర్యలు కఠినంగా ఉండాలి.

- కల్పన, ల్యాబ్ టెక్నీషియన్, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వీరబల్లి

అత్యంత దారుణం



వైద్యులు దేవుడితో సమానం అంటారు. అలాంటి వారిపై అమానుషంగా వ్యవహస్తే ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో వైద్యురాలిని హత్య చేయడం అత్యంత దారుణమైన విషయం. ఆ మానవ మృగాలకు చట్ట పరంగా కఠిన శిక్ష పడాలి. ఇలాంటి సంఘటన మరెక్కడా జరగకుండా వైద్యులు, సిబ్బందికి పటిష్టమైన రక్షణ కల్పించాలి.

- పిల్లి జయప్రకాష్, టీబీ సీనియర్ సూపర్‌వైజర్, ప్రభుత్వ ఆసుపత్రి, రాజంపేట



సిబ్బందిపై దాడులు తగవు



రోగుల ప్రాణాలు కాపాడే వైద్య సిబ్బందిపై దాడులు చేయడం దుర్మార్గం. ఇంట్లో కుటుంబ సభ్యులతో ఎలా ఉంటారో... వైద్య సిబ్బంది రోగులతోనూ అలాగే ఉంటారు. కోల్‌కతా ఘటన అనంతరం విధులకు వెళ్లాలంటే భయం వేస్తోంది. నా పిల్లలను చదివించి డాక్టర్స్ చేయాలని అనుకున్నా. ఈ దాడులు చూస్తుంటే భయమేస్తోంది. మహిళలకు ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటుచేయాలి.

- సి.అరుణ, ఏఎన్ఎం, చిన్నమండెం ప్రభుత్వాసుపత్రి

మేలుకునేదెప్పుడు..!?



కలకత్తా మహిళా డాక్టర్ పై హత్యాచారం అమానుషం. ఈ మధ్య మహిళలే లక్ష్యంగా దాడులు పెరిగాయి. బాధితురాలినే నేరస్తురాలిగా చూపే ప్రయత్నాలు సిగ్గు చేటు. డిల్లీలో నిర్భయపై జరిగిన దారుణంలోనూ, ముంబై సాక్షి మిల్స్‌లో జర్నలిస్టుపై జరిగిన అఘాయిత్యంలోనూ, ఇప్పుడు కలకత్తా అభయ విషయంలోనూ అదే జరుగుతోంది. వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణకు చట్టం అవసరం.

-కె. పవిత్ర రెడ్డి, కనసానివారిపల్లె, గదగ్ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థి

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

నిమ్మనపల్లె : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. రెడ్డివారిపల్లె పంచాయతీ యర్రాతివారిపల్లె సమీపంలో ట్రాక్టర్, డ్రైవర్ ప్రేమ్ కుమార్ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువతిని వేధించిన వ్యక్తులపై కేసు నమోదు

మదనపల్లె : యువతిని వేధించడమేగాక, దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ రామచంద్ర తెలిపారు. పట్టణంలోని షఫిషింగ్‌పేటకు చెందిన ఓ యువతి(20)ని అదే ప్రాంతానికి చెందిన వినోద్ మూడేళ్లుగా ప్రేమిస్తున్నాడు. అయితే ఇటీవల అతడి ప్రవర్తన నచ్చని యువతి వినోద్‌ను దూరంపెట్టింది. దీంతో బుధవారం రాత్రి తన స్నేహితుడైన కల్యాణ్, రియాజ్ మరో యువకుడితో కలిసి యువతి ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేశారు. అడ్డుకున్న వ్యక్తులపై దాడి చేశారు. యువతి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రమణ తెలిపారు.

పాడిరైతు బ్యాంకు అకౌంట్లో డబ్బులు మాయం

గుర్రంకొండ : మహిళా పాడిరైతు బ్యాంకు అకౌంట్లో డబ్బులు మాయమైన సంఘటన మండల కేంద్రమైన గుర్రంకొండలో జరిగింది. ఆమె బ్యాంకు అకౌంట్లో నుంచి సైబర్ నేరగాళ్లు రూ.59 వేలు మాయం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కొత్తపేట వీధికి చెందిన ఆదినారాయణ, శైలజ దంపతులు పాడి పరిశ్రమ ద్వారా వచ్చిన మొత్తాన్ని స్థానిక యూనియన్ బ్యాంకులోని ఖాతాలో జమ చేసేవారు. గురువారం నగదు డ్రా చేసేందుకు వెళ్లగా అప్పటికే ఖాతాలో డబ్బులు డ్రా అయినట్లు తెలుసుకొన్నారు. బ్యాంకు స్టేట్ మెంట్ తీసి పరిశీలించగా చిత్తూరులో గత మార్చినెల 5తేదీన రూ.12వేలు, జూన్ 5తేదీన రూ.25వేలు, జులై 5వ తేదీన 22వేలు డ్రా చేసుకొన్నట్లు తేలింది. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ రాఘవరెడ్డిని వివరణ కోరగా రాయచోటిలోని సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి రసీదు తీసుకొస్తే విచారణ చేసి మహిళా రైతుకు న్యాయం చేస్తామన్నారు.

డేంజర్ హైవే!


నేటి రోజుల్లో సహజ మరణాలకంటే.. రోడ్డు ప్రమాదాల్లో తనువు చాలిస్తున్న ఘటనలే ఎక్కువ. ఇంటి నుంచి బయటికి వెళ్లిన వ్యక్తి క్షేమగా తిరిగి వస్తాడా.. లేదా అని చెప్పలేని పరిస్థితి. కడప-రేణిగుంట హైవే (ప్రస్తుతం) డేంజర్‌గా మారింది. ఈ దారిలో నిత్యం ఏదో ప్రాంతంలో ప్రమాదం జరుగుతూనే ఉంది. ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

- నిత్యం ప్రమాదాలతో గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- 20 వేర్వేరు ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ గుర్తింపు
- ఆక్రమణలతో సింగల్ రోడ్డుగా మారుతున్న వైనం



కడప-రేణిగుంట జాతీయరహదారి

రాజంపేట ఎస్‌డీపీఓ పరిధిలో ప్రమాదాల వివరాలు ఇలా ఉన్నాయి..



రాజంపేట : కడప-రేణిగుంట హైవే రెండు దశాబ్దాల కిందట సింగల్ రోడ్డును విస్తరించి డబుల్ రోడ్డుగా మార్చారు. ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షణలో కొనసాగుతున్నా.. రహదారి అభివృద్ధి, ఆక్రమణలపై దృష్టి పెట్టడం లేదు.

ప్రస్తుతం ఈ హైవేలో ప్రయాణం నరకంగా మారుతోంది. ఎటువైపు నుంచి ప్రమాదం పొంచి ఉందో తెలియని పరిస్థితి. కడప శివారులోని జెఎంజె కళాశాల నుంచి భాకరాపేట సర్కిల్, మాధవరం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, మంగంపేట, రైల్వే కోడూరు, శెట్టిగుంట, కుక్కలదొడ్డి వరకు ఈ దారిలో ప్రయాణం కత్తిమీద సాములా మారింది. పేరుకు హైవేలైనా.. భారీ మలుపులు ఉండడం, వాహనాలు వేగంగా దూసుకు రావడం, నియంత్రణ కోల్పోవడం వంటి ఘటనలు నిత్యం ప్రయాణికులను యమ పురికి పంపిస్తున్నాయి. ఒంటిమిట్ట, నందలూరు, రెడ్డిపల్లె కట్టపై వాహనాలు అదుపుతప్పి చెరువులో పడిన సంఘటనలున్నాయి.

యాత్రికుల రోడ్డుగా..

దక్షిణ భారతదేశం నుంచి తిరుమలకు కడప-రేణిగుంట మీదుగా వేలాది యాత్రికులు వాహనాల ద్వారా చేరుకుంటున్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటకతోపాటు రాజస్థాన్, యూపీ తదితర రాష్ట్రాల నుంచి వేలాది యాత్రికులు ప్రయాణం ఈ మార్గంలోనే కొనసాగిస్తుంటారు. అయితే వారి వాహనాలు అనేక సార్లు ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. తుపాను, ఇతర వాహనాల్లో యాత్ర కొనసాగించడం అధికంగా ఉంటుంది. తిరుపతి, చెన్నై, ముంబాయి, హైదరాబాద్‌కు రాకపోకలు జరుగుతున్నాయి. కడప-రేణిగుంట హైవేలో ట్రాఫిక్ రోజు రోజుకూ పెరుగుతోంది. నిత్యం 17 వేలకు పైగా వాహనాలు పరుగుతీస్తున్నాయి. అంతేగాక.. ఈ మార్గంలో రోడ్డు ప్రయాణం రెండు నుంచి మూడుగంటలకు పైగా పడుతోంది. సకాలంలో గమ్యాలకు చేరలేని పరిస్థితి.

ప్రతి చోట బ్లాక్ స్పాట్స్

కడప-రేణిగుంట హైవేలో ప్రతి మండల పరిధిలో బ్లాక్ స్పాట్స్ గుర్తించారు. రాజంపేట అర్బన్‌లో 3, నందలూరు 2, రైల్వేకోడూరు 3, పుల్లంపేట 3 ఓబులవారిపల్లి 6, మన్నూరు 3తో పాటు అలాగే ఒంటిమిట్ట, మాధవరం, భాకరాపేటలో కూడా ప్రమాదానికి దారితీసే ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాలు సర్వే చేసి కడప-రేణిగుంట ప్రస్తుత హైవేలో ప్రమాదాలు జరుగుతున్నాయని నిర్ధారణకు వచ్చారు. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట పెద్దాసుపత్రిలో ట్రామా సెంటర్ కూడా ఏర్పాటుచేశారు.

గ్రీన్ ఎక్స్‌ప్రెస్ నేషనల్ హైవే ప్రత్యామ్నాయం

పాత హైవేకి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం గ్రీన్ ఎక్స్‌ప్రెస్ నేషనల్ హైవే రోడ్డు(716)ను తీసుకొచ్చింది. రూ.3వేల కోట్ల వ్యయంతో తక్కువ సమయంలో తిరుపతి చేరేలా 133 కిలోమీటర్ల హైవేను తీసుకొస్తున్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలో రైలుమార్గానికి పడమర వైపు కొనసాగుతోంది. తిరుపతి, చెన్నై నగరాలకు త్వరగా చేరుకునేందుకు ఈ మార్గం దోహదపడుతుంది. అంతేగాకుండా భారీ వాహనాలు, దక్షిణ భారత దేశాల నుంచి వచ్చే యాత్రికులు ఇక్కడ వెళ్లనున్నాయి. ఫలితంగా ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని అధికారులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాద నివారణా చర్యలు అవసరం



కడప-రేణిగుంట జాతీయ రహదారిలో పకడ్బందీగా ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలి. కలెక్టర్, ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించాలి. భాకరాపేట నుంచి రేణిగుంట వరకు ఎక్కడో ఓ చోట నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవించి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికైనా ఎన్‌హెచ్ఏఐ అధికారులు, పోలీసు, రవాణా శాఖలు సంయుక్తంగా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

- ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

భద్రతా వారోత్సవాల్లో అవగాహన కల్పిస్తున్నాం



రోడ్డు భద్రతా వారోత్సవాల ద్వారా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెపుతున్నాం. మద్యం తాగి డ్రైవ్ చేయరాదని, లైసెన్స్ తప్పనిసరి అని వివరిస్తున్నాం. ఇప్పటికే బ్లాక్ స్పాట్స్ గుర్తించారు, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నాం. డ్రంక్ అండ్ డ్రైవ్‌లు పెంచి ప్రమాదాలను నియంత్రిస్తాం.

- వినోద్‌కుమార్, ఎంవీఐ, రాజంపేట

జన్‌ధన్ ఖాతాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఏపీజీబీ ఛైర్మన్ సత్య ప్రకాశ్‌సింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్‌ధన్ యోజన ప్రారంభించి నేటికి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ సత్య ప్రకాశ్‌సింగ్ తెలిపారు. స్థానిక మరియాపురంలోని ఏపీజీబీ మెయిన్ బ్రాంచ్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుమారు 11 లక్షల మంది ఖాతాదారులకు జన్‌ధన్ యోజన పథకం యొక్క ప్రయోజనాలైన జీరో బ్యాలెన్స్ అకౌంట్, రూ.10వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, రూ.2 లక్షల రూపే కార్డుతో ప్రమాద బీమా సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. జన్‌ధన్ ఖాతాదారులకు ఎస్ఎంఎస్‌లను పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



బి.సాంబశివ (ఫైల్)

కలకడ : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. కలకడ మండలం కోన పంచాయతీ తిప్పిగారిపల్లె గ్రామానికి చెందిన బోజనపు వెంకటరమణ కుమారుడు బి.సాంబశివ తన కారును తీసుకుని మదనపల్లె మిట్స్ కళాశాల విద్యార్థులకు ఉత్తర కర్ణాటక యాత్రకు వెళ్లాడు. తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన అతడి భార్య నాగరాణి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కడప బిగ్ టీవీ రిపోర్టర్‌పై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మేయర్ కె.సురేష్‌బాబు ఇంట్లోకి చెత్త వేసేందుకు టీడీపీ కార్యకర్తలను ప్రోత్సహించిన కడప బిగ్ టీవీ ఛానెల్ రిపోర్టర్ బొమ్మలాట మధుసూదన్‌పై కేసు నమోదైంది. ఈ నెల 27న మేయర్ సురేష్‌బాబు ఇంటి ఎదుట ఆందోళన చేసేందుకు కడప ఎమ్మెల్యే ఆర్.మాధవీరెడ్డి ఉసిగొల్పడంతోనే మేయర్ ఇంట్లోకి చెత్త వేశారని వైఎస్ఆర్‌సీపీ నాయకులు తెలిపారు. మేయర్ ఫిర్యాదు మేరకు టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు బొజ్జా తిరుమలేష్, మరింత మందిపై క్రైం.నెం.304/2024లో కేసు నమోదైంది.

ఈ కేసులో ఆందోళన కారులను ప్రోత్సహించి చెత్తను ఇంటిలోకి విసిరేయించాడని కడప బిగ్ టీవీ ఛానెల్ రిపోర్టర్‌పై ఫిర్యాదులో తెలుపడంతో అతడిని నిందితుడిగా చేర్చినట్లు చిన్నచౌక్ సీఐ తేజ మూర్తి తెలియజేశారు. మధుసూదన్ గతంలో ఏబీఎన్ ఛానెల్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న సమయంలో అదే చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొండాయపల్లి సమీపంలో ఓ పెప్సీ గోదాముపై దాడి చేసిన సంఘటనలో క్రైం నెం.214/2023 లో నమోదైన హత్యాయత్నం, ఇతర సెక్షన్లతో కేసులో రెండో నిందితుడిగా వున్నాడు.

ఆధిక్యంలో చిత్తూరు జట్టు



140 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ నిఖిత్‌గౌడ్



112 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ చరణ్‌జీత్



6 వికెట్లు తీసిన అనంతపురం బౌలర్ దత్తారెడ్డి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 22 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 92 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 420 పరుగులు చేసింది. జట్టులోని చరణ్‌జీత్ 112 పరుగులతో నాటౌట్‌గా నిలువగా, నిఖిత్ గౌడ్ 140 పరుగులతో రాణించారు. వీరితో పాటు శశాంక్ శ్రీవత్స 61, తేజారెడ్డి 63 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ భార్గవ్ 2 వికెట్లు తీశాడు. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 280 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు 140 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

విజయం దిశగా అనంత జట్టు

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 160 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 46.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని మహేంద్రారెడ్డి 30 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ కనిష్ 4 వికెట్లు, సాబ్జాన్ బాషా 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 40.4 ఓవర్లలో 206 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మనోజ్‌రాజు 55 పరుగులు చేశాడు. అనంత బౌలర్లు దత్తారెడ్డి 6 వికెట్లు, లోహిత్‌సాయి 2 వికెట్లు తీశారు. అనంతరం 190 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్ రోషన్ 35 పరుగులతో క్రీజులో ఉన్నాడు. కర్నూలు బౌలర్ సాబ్జాన్ బాషా 2 వికెట్లు తీశాడు. దీంతో రెండోరోజు ఆట ముగిసింది.

అక్రమ మద్యం పట్టివేత

పులివెందుల రూరల్ : కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పులివెందుల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రాయలపురం వద్ద పులివెందుల అర్బన్ సీఐ జీవన్ గంగనాథ్‌బాబు, ఎస్ఐ నారాయణ వాహనాల తనిఖీ చేపట్టారు. బెంగళూరు నుంచి పులివెందుల వైపు వస్తున్న లారీని తనిఖీ చేశారు. భారీగా మద్యం ఉన్నట్లు గుర్తించి డీఎస్పీ మురళీనాయక్ లారీని పరిశీలించారు. వివరాలను తర్వాత వెల్లడిస్తామన్నారు.

భార్యతో గొడవపడి బలవన్మరణం



కొత్తపల్లెబిడికిలో ఉరి వేసుకొని మృతి చెందిన నాగేంద్ర

సంబేపల్లె : భార్యతో గొడవపడి.. ఉరి వేసుకుని భర్త బలవన్మరణం పొందిన సంఘటన మండలంలోని కొత్తపల్లెబిడికిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. శెట్టిపల్లె పంచాయతీ కొత్తపల్లెబిడికి చెందిన నాగేంద్ర రాయచోటిలోని ప్రైవేట్ విద్యా సంస్థలో బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. అతడికి భార్య లక్ష్మీదేవి, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. కుటుంబ సమస్యలతో బుధవారం రాత్రి నాగేంద్ర తన భార్యతో గొడవపడ్డారు. దీంతో ఆమె అదే గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం తెల్లవారుజామున తోటి కూలీలు లక్ష్మీదేవిని పనులకు తీసుకెళ్లేందుకు ఇంటికి వెళ్లగా.. ఇంటి పైభాగంలో కడ్డీకి నాగేంద్ర ఉరివేసుకుని కనిపించాడు. బంధువులు చూడగా.. అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి.. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్ ప్రారంభం



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న డీఐజీ కోయా ప్రవీణ్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడులు

పుల్లంపేట : పుల్లంపేటలో పోలీస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో గురువారం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను కర్నూలు డీఐజీ కోయా ప్రవీణ్, అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఐజీ కోయా ప్రవీణ్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. ఆదాయాన్ని పోలీస్ వెల్ఫేర్ కోసం ఉపయోగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట డీఎస్పీ సుధాకర్, సీఐ బివి రమణ, పుల్లంపేట ఎస్ఐ మోహన్‌కుమార్ గౌడ్, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రవీణ్

సంబేపల్లె : చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై స్కూటర్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. పీఎస్ కాలనీ పంచాయతీ గొల్లపల్లెకు చెందిన ప్రవీణ్, అనూష ద్విచక్ర వాహనంలో రాయచోటికి వెళ్తున్నారు. మార్గ మధ్యంలో మోటకట్ల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం రాయచోటికి తరలించారు.

వీధి కుక్కల పట్టివేత




కుక్కను పట్టుకుంటున్న సిబ్బంది

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలో కుక్కల బెడద ఎక్కువై ప్రజలు నానా తిప్పలు పడాల్సి వస్తోందని 'క్షణ క్షణం భయం భయం' కథనం సాక్షిలో ఈ నెల 21న కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు రెండు రోజుల నుంచి కోడూరు పంచాయితీ కార్యదర్శి ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది 30కుక్కలకు పట్టుకొన్నారు. ప్రజలకు ఇబ్బందిలేకుండా చేస్తామన్నారు.

మూడు స్టేషన్లలో రైళ్ల స్టాపింగ్ పునరుద్ధరణ

డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు భరత్‌రెడ్డి



తల్లెంభరత్‌రెడ్డి, మాజీ సభ్యుడు, డీఆర్‌యుసీసీ

రాజంపేట : రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ.మిథున్‌రెడ్డి కృషితో పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని నందలూరు, ఓబులవారిపల్లె, పీలేరు రైల్వే స్టేషన్లలో పలు రైళ్ల స్టాపింగ్ పునరుద్ధరణ జరిగిందని గుంతకల్ డివిజనల్ రైల్వే యూజర్స్ కమిటీ మాజీ సభ్యుడు తల్లెం భరత్‌రెడ్డి అన్నారు. 'సాక్షి'తో గురువారం ఆయన మాట్లాడుతూ నందలూరు, ఓబులవారిపల్లె రైల్వే స్టేషన్లలో రెండు రైళ్ల స్టాపింగ్స్‌కు గుంతకల్ డీవోఎం(కోచ్) పేరిట విడుదలైన ఉత్తర్వులు ప్రయాణికులను గందరగోళం చేశాయన్నారు. తిరుపతి-కొల్హాపూర్(17415/17016)కు నందలూరు, ఓబులవారిపల్లె హాల్టింగ్‌ను పునరుద్ధరించారన్నారు. తిరుపతి-నిజాముద్దీన్ మధ్య నడిచే రాయలసీమ (12793/12794)రైలుకు ఓబులవారిపల్లె, రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇచ్చారన్నారు. నందలూరులో ఈ రైలుకు హాల్టింగ్ ఇవ్వలేదన్నారు. తిరుపతి-విశాఖ మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్(17487/17488)రైలుకు నందలూరులో హాల్టింగ్ పునరుద్ధరించారన్నారు. ఈ రైళ్ల హాల్టింగ్ ఈ నెల 30వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని ఎస్సీ రైల్వే ప్రకటించిందన్నారు. పీలేరు రైల్వే స్టేషన్‌లో కాచిగూడ-మధురై నడిచే వీక్లీ (22715/227160)రైలుకు వచ్చే నెల 7, 8వ తేదీల్లో హాల్టింగ్ ఇచ్చారన్నారు. నాగర్ కోయిల్ ఎక్స్‌ప్రెస్(16339,/16340) రైలుకు ఈ నెల 29, 2వ తేదీలలో హాల్టింగ్ ఇచ్చారన్నారు. ఈ స్టాపింగ్స్‌ను ఆరునెలలపాటు ప్రయోగాత్మకంగా కొనసాగిస్తారన్నారు. స్టాపింగ్స్ పర్మినెంట్ చేయాలని మరోసారి ఎంపీ దృష్టికి తీసుకెళతామన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి రాజంపేట పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని రైల్వే సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తున్నారన్నారు.

పలమనేరు బాలాజీకి తెలుగు భాషా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న బాలాజీ

పెద్దతిప్పసముద్రం: తెలుగు భాషా దినోత్సవంలో చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన రచయిత, ఎంపీడీఓ పలమనేరు బాలాజీకి పురస్కారం దక్కింది. గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గురువారం సీఎం, డిప్యూటీ సీఎం చేతులమీదుగా రాష్ట్ర తెలుగు భాషా పురస్కారం ఆయన అందుకున్నారు. కె.వి.నాగయ్య, జయమ్మ దంపతులకు బాలాజీ 19.01.1974లో చిత్తూరు జిల్లా పలమనేరులో జన్మించారు. ఎం.ఎ. ప్రభుత్వ పాలనా శాస్త్రం చదివి ప్రస్తుతం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పెద్దతిప్ప సముద్రంలో పని చేస్తున్నారు. ఈయన సేవలకు మెచ్చి జిల్లా స్థాయిలో ఏడుసార్లు ఉత్తమ ఎంపీడీవో పురస్కారం దక్కింది. ఈయన ×గది లోపలి గోడ, చిగురించే మనుషులు, ఒక సాయంత్రం త్వరగా ఇల్లు చేరినప్పుడు కథా, ×మాటల్లేని వేళ , ఇద్దరిమధ్య₹ అనే కవితా సంపుటాలను వెలువరించారు. ఈయనకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, సైమల్ పురస్కారం ,నూతలపాటి గంగాధరం పురస్కారం, మాడభూషి రంగాచారి స్మారక పురస్కారం , కందుకూరి వీరేశలింగం పంతులు స్మారక పురస్కారం, ద్రవిడ విశ్వవిద్యాలయ పురస్కారం పొందారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన రాఘవరెడ్డి

మదనపల్లె: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. కురబలకోట మండలం మినమరెడ్డిగారి పల్లెకు చెందిన మల్‌రెడ్డి కుమారుడు రాఘవరెడ్డి(50) ఈ నెల 22న వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో వెళుతూ మదనపల్లె మండలం సీటీఎం రైల్వేగేట్ వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా, చికిత్స పొందుతూ ఈ నెల 28న మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహానికి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.